

# సర్దుబాటు

**భార్య సంపాదన లేకుండా సంసారం సాగనప్పుడు, ఆమె బాధ్యతల్లో కూడా పాలు పంచుకోవడం భర్త నేర్చుకోవలసి ఉంటుంది**

రాత్రి ఎనిమిదిన్నర అయింది. వంటింట్లో చకచక గిన్నెలు కడిగి, స్టవ్ గట్టు అలికి తుడుస్తూంది సుజాత. 'జునూన్' అప్పుడే మొదలవుతూంది టి.విలో. సుజాతకి 'జునూన్' సీరియల్ ఎంతో ఇష్టం. ఎన్ని పనులున్నా తీరిక చేసుకుని చూస్తుంది. సీరియల్ మొదలయ్యేలోగా పని పూర్తి చేసుకోవాలని గబగబ గట్టు తుడుస్తూండగా కాలింగ్ బెల్ మోగింది. పిల్లలిద్దరూ సీరియల్ ముందు అడ్వర్టయిజ్‌మెంట్లు శ్రద్ధగా చూస్తున్నారు. రవీంద్ర పొద్దుట పూర్తి చెయ్యని పేపరు శ్రద్ధగా చదువుతున్నాడు. బెల్ మరోసారి మోగింది. "బెల్ కొడుతున్నారు ఎవరో, కాస్త చూస్తారా?" సుజాత అరిచింది వంటింట్లోంచి. రవీంద్ర తలుపు తీసి "అరే, అక్కయ్యా..." అరిచాడు సంతోషంగా. వంటింట్లోంచి తొంగి చూసిన సుజాతకి ఆడబడుచుని, ఆవిడ భర్తని చూడగానే ఒంట్లో బలమంతా ఒక్కసారి ఎవరో లాగేసినట్లయిపోయింది. 'ఓ గాడ్' అనుకుంది. 'ఇప్పుడు మళ్ళీ వండాలా భగవంతుడా' అన్న ఆలోచన రాగానే నీరసం ముంచుకువచ్చింది. గెస్టులు, దగ్గిర బంధువులు వచ్చినా సంతోషం లేకపోగా. విసుగు, కోపం, చిరాకు, నీరసం — అన్నీ వచ్చేస్తున్నాయి సుజాతకీమధ్య. ఇంట్లో చాకిరీ, బ్యాంకి ఉద్యోగం, పిల్లలు, వాళ్ళ చదువులు, బస్సు ప్రయాణాలు — వీటన్నింటితో కొంపలో ఎప్పుడొచ్చిపడదామా... తప్పక ఇంత వండి పడేసి ఎప్పుడు పక్క మీద వాల్దామా అని ఎదురుచూసే లక్షా తొంభయిమంది ఉద్యోగినులలో సుజాత ఒకర్తి. హైదరాబాదులో కాపురంలో చుట్టాల తాకిడి ఎక్కువే. అందులో ఇటు, అటు రెండు వైపులా బంధుజనం ఎక్కువే అవడంతో ఏ పెళ్ళిళ్ళకో, పెళ్ళిచూపులకో, ఆస్పత్రి పనులకో, ఉద్యోగాల ఇంటర్వ్యూలకో, కాలేజీ సీట్లకో ఎవరో ఒకరు వస్తూనే ఉండి చుట్టాలంటే విసుగొచ్చేసింది సుజాతకి. కాస్త నాల్గు రోజులు రొటీన్‌లో పడి 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకునే వేళకి ఎవరో ఒకరు దిగుతూ సుజాత సహనానికి పరీక్ష పెడ్తున్నారు.

చిత్రాలు: నర్సిం




"సుజా, అక్కయ్యొచ్చింది. రండి బావగారూ." రవీంద్ర బావగారి చేతిలో సూట్‌కేసు అందుకుంటూ ఆహ్వానించాడు. నిట్టూర్పు అణచుకొని, మొహాన రాని నవ్వు పులుముకుని, "రండి వదినగారూ, ఏమిటి కబురన్నా లేకుండా వచ్చారు" అంది సుజాత.

"హఠాత్తుగా బయలుదేరాల్సి వచ్చింది. ఫోను చేద్దాం అంటే మీ పక్కింటివాళ్ళు లేనట్లున్నారు. రెండుసార్లు చేసినా ఎవరూ తీయలేదు. సరే, ఎలాగో సాయంత్రం వచ్చేస్తాం, ఫరవాలేదు ముందు తెలియపర్చకపోయినా అనుకుని బయలుదేరాం. రైలు రెండున్నర గంటలు ఆలస్యం అయింది." ఆడబడుచు అంది.

"ఏమిటి? ఏమయింది - అంతా కులాసాయేనా? నీ వంట్లో బాగుంది కదా." రవీంద్ర అడిగాడు.

"అదేనోయ్, మీ అక్కయ్యకే ఈమధ్య వంట్లో బాగుండడంలేదు. అక్కడ లేడీ డాక్టర్ యూటెరస్ ఆపరేషన్ చెయ్యాలంటూంది. ఓసారి ఈ ఊళ్ళో మంచి డాక్టరుకి చూపించి సలహా తీసుకుని డిసైడ్ చేద్దామని..." బావగారు చెప్పారు.

"అలాగా... అయ్యో, చెప్పనేలేదే - సుజాతకి మంచి గైనకాలజిస్ట్ తెలుసు. చూపిద్దాంలెండి - ఈ రోజుల్లో ఈ ఆపరేషన్లు మామూలయిపోయాయి."

'ఆస్పత్రి పని... అంటే కనీసం రెండు మూడు రోజులు. ఆపైన ఆపరేషన్ ఇక్కడే అంటారు...' సుజాతకి ఆలోచించడానికే భయం వేసి వంటింట్లోకి వెళ్ళింది. 'జునూన్ లేదు ఏం లేదు - మళ్ళీ వంట, గిన్నెలు కడుక్కోడం.' గొంతులో దుఃఖం అడ్డుపడింది సుజాతకి - బియ్యం కడిగి కుక్కరులో పెట్టి, నాలుగు వంకాయలుంటే వేయించడానికి తరగసాగింది. 'నయమే - మధ్యాహ్నం చారు పారేశాను కాను' అనుకుంటూ ఫ్రిజ్ నుంచి చారుగిన్నె తీసింది. పెరుగు కాస్తే ఉంది. నిన్నటి పెరుగుంటే ఇది, అది కాస్త కలిపింది. వాళ్ళు స్నానాలూ అవీ చేసి వచ్చేలోగా వంటయిందనిపించింది.

> **ఉదయం 5 గంటలకి లేచి ఉరుకులు పరుగులతో తానంత అవస్థపడుతూంటే, ఏడుగంటలకి లేచి, హాయిగా కాఫీ తాగుతూ పేపరు చదివే అతన్ని చూస్తే ఒళ్ళు మండిపోతూంటుంది.**

"ఏం, మరదలి మొహం అలా వాడిపోయింది - వంట్లో బాగులేదా - పాపం మళ్ళీ వండాల్సి వచ్చింది. ఈ వెధవ రైళ్ళు ఎప్పుడూ ఆలస్యమే" అంది కమల.

"ఆс, ఏం ఉందిలే. వంటెంతసేపు" అన్నాడు రవీంద్ర. సుజాత మొగుడ్ని మింగేద్దాం అన్నట్టు చూసింది. 'వంటెంత సేపుట? వండితే తెలుస్తుంది. అందులో పని అంతా అయింది అనుకున్నాక మళ్ళీ వంట అంటే ఎంత విసుగు. ఈ మగాళ్ళకేం, ఎంత సులువుగా వంటెంతసేపు అంటున్నాడు'. కసిగా అనుకుని రాని నవ్వు పులుముకుంది. 'ఈయనగారికి ఈ అక్కగారిని చూస్తే చాలా ప్రేమ. ఆరుగురు పిల్లల్లో ఆఖరివాడు ఇతను. పెద్దావిడ ఆవిడ... తల్లికి ఒంట్లో బాగులేకపోతే అక్కగారే అన్నమానూ తమ్ముడ్ని ఎత్తుకోడం, ఆలనా పాలనా చూసేదని ఈయనకి, ఆవిడకి చాలా ఎటాచ్‌మెంటు. మంచిదే - అక్కా తమ్ముళ్ళ ప్రేమలు - తనకేం అభ్యంతరం! ఎటొచ్చీ చాకిరీ చెయ్యడానికే ఈ ఏడుపు' అనుకుంది.

వాళ్ళ భోజనాలు కానిచ్చి, పిల్లల గది వాళ్ళకిచ్చి, కొడుకుని తమ మంచాల మధ్యలో పడుకోపెట్టి, కూతురికి డ్రాయింగురూములో దివాను మీద పక్క వేసింది. వాళ్ళింకా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. పది దాటాక ఇంక కూర్చోలేక "నేను పడుకుంటానండి, కాస్త తలనొప్పిగా ఉంది" అంది సుజాత ఆడబడుచుతో.

"పడుకో అమ్మా. పాపం పొద్దుననగా లేస్తావు" అన్నారు శేషగిరిరావుగారు అభిమానంగా చూస్తూ. బతుకుజీవుడా అనుకుంది సుజాత. తలగడ మీద తల ఆన్చగానే ఒళ్ళెరగకుండా నిద్రపోయింది.

* * *

ఉదయం ఐదు గంటలకే అలారం పెట్టినట్టే మెలకువ వచ్చేసింది. నిద్ర పోయాక కాస్త ఫ్రెష్‌గా ఉందనిపించింది సుజాతకి - రోజూ ఒకటే రొటీను. ఐదు గంటలకి లేచిందగ్గిరనించి ఒకటే పరుగులు - కప్పు కాఫీ కాస్త కూర్చుని

తాగి ఎంజాయ్ చెయ్యడానికి కూడా తీరికుండదు. టిఫిను, వంట చేస్తూనే పిల్లలని లేపి తయారుచెయ్యడం, పక్క తియ్యడం, ఇల్లు గబగబ తుడిచి, పిల్లలకి టిఫిను పెట్టి, నలుగురికీ లంచ్ బాక్సులలో చపాతీలు పెట్టి, పిల్లల పుస్తకాల దగ్గిర నించి సర్దిపెట్టాలి - మధ్యలో భర్తగారి అరువులకి సమాధానం చెప్తూ... పిల్లలని పంపి, తనింత తిని, టిఫిను బాక్స్ పట్టుకుని ఉరుకులు పరుగులతో బస్సు స్టాప్ దగ్గిరకి చేరి - రెండు బస్సులు మారి బ్యాంక్ చేరి, మళ్ళీ సాయంత్రం ఐదు గంటలకి శవంలా ఇల్లు చేరి, కాస్త టీనీళ్ళు తాగి బడలిక తీర్చుకుని వంటలో జొరబడి, వంట చేస్తూనే పిల్లల చదువులు చూస్తూ... మర్నాటికి కావల్సిన కూరలు తరిగిపెట్టుకుని... అటు ఇల్లాలిగా, ఇటు తల్లిగా, ఉద్యోగినిగా క్షణం తీరిక లేక మరబొమ్మలా చాకిరీ చెయ్యడమేనా ఈనాటి స్త్రీలు సాధించిన ప్రగతి అన్న సందేహం సుజాతకి వస్తుంది. ఆదివారం వస్తే మరింత పని - తలంట్లు, బట్టలుతుక్కోడాలు. ఆదివారం అని పిల్లలకి ఏ స్వీటో చేసి పెట్టడం, ఆదివారం అని వచ్చే ఫ్రెండ్సుకి మర్యాదలు, కూరలు తెచ్చుకోవడం... ఇదా జీవితం అంటే - బొత్తిగా జీవితం ఇంత మెకానికల్ అయిపోయిందేమిటి! చక్కగా తనకి నచ్చిన ఓ మంచి ఇంగ్లీషు నవల చదివి ఎన్నాళ్ళయింది? థియేటరుకి వెళ్ళి సినిమా చూసి ఎన్ని ఏళ్ళయింది? - హాయిగా ఏ టేప్‌రికార్డరో పెట్టుకుని సావకాశంగా తనకి నచ్చిన పాట విని ఎన్నాళ్ళయింది? కిలోమీటరు దూరంలో ఉన్న గార్డెను కన్నా ఎప్పుడన్నా వెళ్ళారా తాము? చదువుకోడం, ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు, చాకిరీ..... ఈ నాటి స్త్రీ ఎంతలా నలిగిపోతూంది ఇంటా బయటా. తరచు ఈ ప్రశ్నలు సుజాతలో తలెత్తుతున్నాయి. ఈమధ్య ఆడవాళ్ళు చదివి, ఉద్యోగాలు చేస్తూ సాధిస్తున్నదేమిటి? ఇంటా బయటా నలిగిపోతూ మగవాడి బాధ్యత సగం బుజాన వేసుకుని కుంగిపోతున్నారు తప్ప వాళ్ళకేం ఒరుగుతూంది! ఎకనమికల్ ఇండిపెండెన్స్!... హా...హా.. ఎకనమికల్ ఇండిపెండెన్స్... రవి కంటే రెండు మూడు వందలు తక్కువ తన సంపాదన! అయినా, కావల్సిన చీర ఒక్కటైనా కొనుక్కో గలుగుతూందా. నగలు అన్నదానికే ఆస్కారం లేదు... చీరలు, నగలు అటుంచి

**"సారీ మేడమ్ ఏం చెయ్యను? ఇంటా బయటా నిభాయించు కోవడం రెండూ నావల్ల కావడం లేదు. దీనివల్ల ఇంట్లో శాంతి లేదు. సుఖం లేకపోయాక ఎందుకు సంపాదన?"**



కనీసం విసుగ్గా ఉన్న రోజున ఆటో అయినా ఎక్కగలుగుతూందా తను - ఇంటినించి తీసికెళ్ళిన చల్లారిన చపాతీలు తప్ప పక్కనున్న హోటలుకి కొలీగ్స్‌తో వెళ్ళి ఒక దోసన్న తినగలుగుతూందా - ఎప్పుడూ... ప్రతినెలా ఏవో అనుకోని ఖర్చులు. జీతం వచ్చిన రోజున తప్ప ఆ డబ్బు తన పర్సులో ఓ రోజన్నా ఉంటుందా. తన జీతం అంతా ఫ్లాట్ కొన్న లోనుకే సరిపోతూంది మూడొంతులు. మిగతాది ఏ పండుగలకో, ఏ చుట్టాలకో, ఏ గ్రైండరు కొనడానికో, ఇంట్లో వస్తువుకో, పిల్లల బట్టలకో.... ఏం అవుతూందో కూడా తెలియకుండా అయిపోతూంది. తన కొలీగ్స్ కొందరు ఇస్త్రీ మడత నలగని బారెడు వెంకటగిరి చీరలు కట్టుకుని వస్తారు. ఇవి చేయించుకున్నాం, అవి చేయించుకున్నాం అంటూ గాజులు, గొలుసులు చూపిస్తారు.... తన సంపాదనతో తాను ఏం ఎంజాయ్ చేస్తూంది - 'ఇదంతా ఎవరి కోసం, నీ కోసం కాకపోతే' అంటాడు రవి. ఫ్లాట్ కొన్నా టి.వి కొన్నా ఫ్రిజ్ కొన్నా అన్నీ తన కోసమే అంటాడు తెలివిగా - అంటే ఆడవాళ్ళ సంపాదనతో వాళ్ళకి కావల్సిన చిన్న చిన్న కంఫర్ట్సు ఇచ్చి, అదంతా తాను వాళ్ళ కోసమే చేస్తున్నాననడం! ఇదివరకు ఇల్లు నడపడం మగాడి బాధ్యత. ఇల్లే కొంటాడో, భూములే కొనేవాడో, నగలే చేయించినా, పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలన్నా అదంతా భర్త బాధ్యత. ఇదివరకటి భార్యలే అదృష్టవంతులేమో! ఏదో తెచ్చిపడేసింది వండి పెడ్తూ, పిల్లల్ని చూసుకుంటూ, లిమిటెడ్ కోరికలతో, వచ్చే డబ్బుతో తృప్తిగా బతికేవారు. అప్పటికంటే ఇప్పుడు ఆడదానికి ఒరిగిందేముంది. చదువుకున్నా ఉద్యోగం చేస్తున్నా మగాడి అండనే బతుకుతూంది. మొగుడ్ని కాదని ఏ చిన్న నిర్ణయమూ చెయ్యలేదు ఇంట్లో. సొంత డబ్బు ఖర్చు పెట్టాలన్నా భర్తగారి ఆమోదముద్ర లేనిదే ఏం చెయ్యగలుగుతూంది. ఈ పిచ్చి ఆడవాళ్ళు ఏదో చదివి సంపాదిస్తూ చాలా ప్రగతి సాధించినట్టు సంబరపడిపోతున్నారు. అంతే...

సుజాతకి ఒళ్ళు మండిపోయినప్పుడల్లా ఇలాంటి ఆలోచనలు వస్తాయి. అటు తను ఇంట్లో చాకిరీ, బయట చాకిరీ చేస్తూ నలిగిపోతూంటే, ఇటు రవి ఇంటి పని ఆడదాని బాధ్యత అన్నట్టు ప్రవర్తిస్తుంటే పుండు మీద కారం చల్లినట్లుంటుంది. ఉదయం 5 గంటలకి లేచి ఉరుకులు పరుగులతో తానంత అవస్థపడుతూంటే, ఏడుగంటలకి సావకాశంగా లేచి, హాయిగా కాఫీ తాగుతూ పేపరు చదివే అతన్ని చూస్తే ఒళ్ళు మండిపోతూంటుంది. అసూయగా ఉంటుంది. వండి వార్చక్కరలేదు. చిన్న చిన్న పనులన్నా చెయ్యొచ్చు - పక్కలు వేయడం, డస్టింగ్‌లు, పిల్లల పుస్తకాలు సర్దిపెట్టడం, రాత్రి ఇంటికి వచ్చాక పిల్లల్ని కూర్చోపెట్టి చదివించడం, బజారు సామాన్లు, కూరలు తేవడంలాంటివన్నీ చెయ్యొచ్చు. "నే కూరలు తెస్తే ముదురు, పుచ్చులు అంటావు. బజారు సామాను తెస్తే నూక, బాగులేదు, మైదా పురుగులు, ఆవాలులో ఇసక అంటూ వంకలు పెడ్తావు - నీవే తెచ్చుకో." ఓసారి బాగులేవంటే రెండోసారి మంచివి తేకపోగా- అసలుకే ఎసరుపెడతాడు - మరీ కోపం, విసుగు వచ్చి పక్కలు వేయమంటే దుప్పటి మడతలన్నా పోవు. ఎక్కడవక్కడే ఉంటాయి. డస్టింగ్ చేస్తే - ఆ పని తీరు చూసి రెండోసారి చెప్పకుండా చేస్తాడు - ఫర్ గాడ్ సేక్ ఇంటికి వచ్చాక ఒక్క క్షణం కూర్చోనీయవు అంటూ విసుగు. పిల్లల చదువు చెప్పమంటే - విశ్రాంతులు వాళ్ళకే కావాలి - తమకేం అక్కరలేదు. ఛా.... అసలు తాను ఈ ఉద్యోగంలో చేరడం పొరపాటు అయింది. హాయిగా చదువయ్యాక పెళ్ళి చేసుకుని ఇంటి పట్టున ఉండాల్సింది. మధ్యతరగతి ఇంట్లో పుట్టి, ఏదో చదివి ఉద్యోగం చేసి ఉద్ధరిస్తున్నాననుకుంది అప్పుడు. అందుకే బాగా అయింది తనకి తగిన శాస్తి - ఉక్రోషంగా అనుకుంటుంది.

ఆలోచనలతో, ఆవేశంగా చకచక కూరల మీద కోపం చూపిస్తున్నట్లు తరుగుతూంది సుజాత. "ఏమిటమ్మా మరదలా, నీ కోపం అంతా కూరల మీద చూపిస్తున్నావు." కమలమ్మ హాస్యంగా అంటూ పమిట కొంగుతో మొహం తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చింది. సుజాత నవ్వి... "లేచారా - ఉండండి కాఫీ ఇస్తాను" అంది ఫిల్టరు తీస్తూ. రవీంద్ర మొహం కడుక్కుని డ్రాయింగు రూములోంచి ఆర్డరు వేశాడు. "బావగారు లేచారు - మాకు కాఫీ ఇస్తావా" అంటూ - ఎవరన్నా ఇంటికి వస్తే ఈయన గారు ఇంక ఆర్డర్లు ఎక్కువేస్తారు. వంటింట్లోకి వచ్చి తీసికెళ్ళచ్చుగా అనుకుంది.

పిల్లలకి స్కూలు డ్రస్సులు తొడుగుతున్న సుజాత దగ్గరకి బెడ్‌రూంలోకి వచ్చాడు.

"సుజా, ఇవాళ నీవు సెలవు పెట్టు, అక్కయ్యని డాక్టరు దగ్గిరకి తీసికెళ్ళు" అన్నాడు చాలా క్యాజువల్‌గా. సుజాత మొగుడి వంక చురచుర చూసింది.

"నే సెలవు పెట్టాలా - ఈ నెలలో ఎన్ని రోజులు మానేశానో తెలుసునా... అప్పుడే ఐదు రోజులు - రమ్యకి జ్వరం వచ్చి రెండు రోజులు, నాకు ఒంట్లో బాగులేక రెండు రోజులు. మీ రెండో అక్క వచ్చిందని ఒక రోజు... నా కసలు కుదరదు... మీరే పెట్టి తీసికెళ్ళండి." సుజాత కటువుగా అంది. రవీంద్ర మొహం ఎర్రబడింది. "లేడీ డాక్టరు దగ్గరకి నే తీసికెళ్ళాలా - బుద్ధి ఉండే మాట్లాడుతున్నావా?"

"ఏం తప్పేం ఉంది. మీ బావగారు, మీరు కల్సి తీసికెళ్ళండి. లేడీ

డాక్టరయితే ఆడవాళ్ళే తీసికెళ్ళాలని రూలుందా." రవీంద్రకి కోపం ముంచుకు వచ్చింది.

"మా వాళ్ళెవరన్నా వస్తే నీ మొహం మారిపోతుంది. నిన్న రాత్రి నించి చూస్తున్నాను. ఆ మొహం ఎలా ఉందో చూసుకో... ఎవరన్నా వస్తే ఏడుపు ఒక్కటే తక్కువ నీకు." భార్య మీద కోపం ఆ విధంగా తీర్చుకున్నాడు కసిగా చూసి.

సుజాత చివుక్కున తలెత్తి రవీంద్ర వంక చూసింది. తన మీద వేసిన నెపానికి అవమానంతో గొంతులోకి దుఃఖం తన్నుకువచ్చింది. పెదాలు అదురుతుండగా, "అవును, మీ వాళ్ళొచ్చారని ఏడుస్తున్నానా. ఛా... ఎంత చేసినా, ఏం చేసినా మెప్పు లేదు ఈ పాడు బతుక్కి..." అని చేతిలో దువ్వెన విసిరికొట్టి వంటింట్లోకి వెళ్ళిపోయింది. రవి తన అక్క, బావ విన్నారేమోనన్న అనుమానంతో అవమానమనిపించి ముఖం మాడ్చుకున్నాడు - గదిలో భార్యాభర్తలు ఏదో అనుకోవడం విన్న కమలమ్మ సగం ఊహించింది. "రవీ, డాక్టరు దగ్గిరకి మేం వెడతాం లేరా. ఎడ్రసూ అదీ చెప్పు. పాపం సుజాతకి సెలవుండద్దూ" అంది.

"నే తీసికెడతాలే అక్కయ్యా... నాకూ తెలుసులే ఆవిడ" అన్నాడు.

"వదినగారూ... నాకు సెలవు పెట్టడానికి కుదరదు. నే రావాలంటే ఎల్లుండి శనివారం ఆఫ్ డే గదా - అప్పుడు తీసికెడతాను." కాస్త ఆవేశం దిగాక వంటింట్లోంచి వచ్చి అంది సుజాత. రవి మొహం ముడుచుకుని, "ఎల్లుండి దాకా ఎందుకు, నే తీసికెడతాను ఇవాళ -" అన్నాడు, నీవు రాకపోతే కొంప మునగదు అన్న ధోరణితో. సుజాత ఇంక రెట్టించకుండా ఊరుకుంది. ఆడబడుచుకి అన్ని రకాల పరీక్షలు అయి మళ్ళీ నెలలో ఆపరేషన్ జరిపేట్లు నిర్ణయం జరిగింది. ఖమ్మంలో కంటే హైదరాబాదులో మంచి డాక్టరు కనక ఇక్కడే చేయించుకోడానికి నిర్ణయించారు అందరూ. మళ్ళీ నెలలో ఆపరేషన్ అనగానే ఇప్పటినించి సుజాతకి భయం పట్టుకుంది. ఆపరేషన్ అంటే కనీసం పదిహేను రోజులుండాలి వాళ్ళు... ఎలా భగవంతుడా నెగ్గుకురావడం - అటు ఇంటిపని, ఇటు ఆఫీసు, ఆస్పత్రికి తిరగడం. ఏదో రెండు రోజులు సెలవు పెట్టగలదు కాని... అప్పటి చాకిరీ తల్చుకుని ఇప్పుడే నీరసం వచ్చింది - ఛా... ఈ ఉద్యోగం వల్లే... ఎంత సెల్ఫిష్‌గా ఆలోచించాల్సి వస్తూంది. ఖర్చు మాట ఎలా ఉన్నా పనికి భయపడి చుట్టపక్కాలు అవసరంలోనూ రాకూడదని కోరుకుంటోంది. అతిథులు, అభ్యాగతుల రోజులు పోతున్నాయి. ఎవరికి వారే... రోజులు వస్తున్నాయి.

> మర్నాడు రవీంద్ర ఉదయం ఆరుగంటలకే లేచిపోయాడు. సుజాత వంటింట్లో పని చేస్తుండగా చకచక పక్కలు తీసేసి, పుస్తకాలు, పేపర్లు సర్దేసి, డస్ట్ చేసేశాడు. పిల్లల పుస్తకాలు సర్దేశాడు.

అక్కగారున్నన్ని రోజులు సుజాతతో ముభావంగానే మాట్లాడాడు రవి. వాళ్ళు వెళ్ళాక మనసులో కోపం వెళ్ళగక్కాడు - "నీ కసలు ఈమధ్య మంచీ మర్యాదా అన్నది లేకుండా పోతూంది. వాళ్ళున్నది మూడు రోజులు. నీ మొహం ఎలా మాడ్చుకున్నదీ నీకు తెలియదేమో కాని చూసేవాళ్ళు ఏమనుకుంటారోనని కూడా లేకుండా నీ అయిష్టం స్పష్టంగా చూపించావు. నీ ఉద్దేశంలో నా వాళ్ళెవరూ నా ఇంటికి రాకూడదని గాబోలు." కయ్యానికి కాలు దువ్వాడు.

"మీ వాళ్ళు నా వాళ్ళు అన్నది గాదు నా బాధ. చాకిరీ చేయలేక చస్తున్నాను అన్నది అర్థం చేసుకోకపోగా, పైగా అపార్థాలు. కట్టుకున్న వాడికి ఇంత పిసరు సానుభూతి లేదు. మీ వాళ్ళు తినిపోతున్నారని నేనెప్పుడూ ఏడవలేదు - చాకిరీ కోసం ఏడుస్తున్నాను. ఇంత పిసరు హెల్ప్ లేకపోగా పైపెచ్చు నిందలు." సుజాతకి ఏడుపు ముంచుకువచ్చింది.

"అ... నీ వొకర్తివే ఇన్నాళ్ళకి ఉద్యోగం చేస్తున్నావు. అందరాడవాళ్ళూ చేస్తున్నారు ఉద్యోగాలు. మొగుడికి, పిల్లలకి వండి పెట్టుకోడం ఊరికి ఉపకారం కాదు..." హేళనగా అన్నాడు. ఆ తిరస్కారం, హేళన భరించే శక్తి లేకపోయింది సుజాతకి.

"నేనీ ఉద్యోగం మానేసి ఇంటిపట్టునుండి వచ్చేపోయే చుట్టాలకి పక్కాలకి వండి వారుస్తాను. అప్పుడు వల్లెత్తి నేనేమన్నా అంటే చెప్పుచ్చుకు కొట్టండి. అంతేగాని, ఇటు ఆఫీసు, అటు ఇంట్లో ఈ చాకిరీ రెండూ నా వల్ల గాదు - ఈ వెధవ ఉద్యోగం మానేస్తే మనశ్శాంతి అన్నా దొరుకుతుందేమో."

"మానేయి. మానేస్తా మానేస్తా అని పదిసార్లు బెదిరించకు. నా కోసం చేస్తున్నట్లు మాట్లాడకు. ఫ్లాటు, ఇంట్లో కంఫర్ట్సు కోసం చేస్తున్నావు. మానేయి. నోరుమూసుకుని నేనేది తెచ్చిపడేస్తే దాన్తోనే కాలం గడుపు. ఇది కావాలి అది కావాలనకుండా —" సుజాత మాటలకి మనసులో బెదిరినా పైకి తేలకుండా బింకంగా అన్నాడు రవి.

* * *

"ఆర్ యూ క్రేజీ సుజాతా!" బ్యాంక్ మేనేజర్ సావిత్రి సుజాత ఇచ్చిన రిజిగ్నేషన్ లెటరు చూస్తూ ఆశ్చర్యంగా అంది — "పన్నెండేళ్ళ సర్వీసు వదులుకుంటావా. మళ్ళీ కావాలంటే ఇలాంటి ఉద్యోగం దొరుకుతుందా. దొరికినా సీనియారిటీ ఉంటుందా." "సారీ మేడమ్. ఏం చెయ్యను? ఇంటా, బయటా నిభాయించుకోవడం రెండూ నావల్ల కావడం లేదు. దీనివల్ల ఇంట్లో శాంతిలేదు. సుఖం లేకపోయాక ఎందుకు సంపాదన?" ఆవిడ సాలోచనగా చూస్తూ, "మిస్టర్ రవీంద్ర కోపరేటివ్ చెయ్యరా ఇంట్లో. పోనీ ఇంట్లో ఎవరన్నా పెద్ద వాళ్ళుంటే తెచ్చి పెట్టుకోకూడదూ."

"ఎవరొస్తారు మేడం. మా అత్తగారు లేరు. మా అమ్మ నాన్నని వదలి ఎందుకొస్తుంది. అయినా ఎవరొచ్చి ఎన్నాళ్ళాదుకుంటారు." "పోనీ ఎవరినన్నా వంటకి దానికి ఇంట్లో పెట్టుకో. అంతేగాని ఉద్యోగం రిజైన్ చెయ్యడం ఫూలిష్ థింగ్."

"పనికే పనిమనిషి - నా టైముకి రాదని అంట్ల దగ్గరనించి తోముకుంటున్నాను. ఉదయం ఎనిమిదైనా రాదు. సాయంత్రం ఆలస్యంగా రమ్మంటే రాదు. పనికే దొరకడం లేదు - వంటకి పెట్టుకుని ఇల్లప్పగిస్తే ఇంక నే సంపాదించింది ఏముంది....చాలా అవస్థగా ఉంది - వచ్చేపోయే బంధువులు, చాకిరీతో ప్రతి దానికి విసుగు, కోపం వచ్చేస్తున్నాయి. పిల్లలతో కాసేపు ప్రేమగా గడపడానికి కూడా ఓపికుండడం లేదు. విసుగెత్తిపోయాను..." సుజాత తన గోడు వెళ్ళబోసుకుంది. ఆవిడా ఉద్యోగినే - ఇంచుమించు అందరి కథలు, అవస్థలు ఒక్కటే - కాస్త భర్త ఇంట్లో భార్య కష్టం, సుఖం అర్థం చేసుకుని చేదోడు ఇస్తే అంత ఇబ్బంది ఉండదు - సానుభూతిగా నిట్టూర్చింది ఆవిడ. "రిజైన్ చెయ్యకు. ఒకటి రెండు నెలలు సెలవుపెట్టు. కాస్త మార్పుగా ఉంటుంది. కాస్త రెస్టు తీసుకుంటే మళ్ళీ కొన్నాళ్ళు చెయ్యడానికి ఓపికొస్తుంది."

ఆవిడన్నది సబబుగానే అనిపించింది సుజాతకి. ఒక్క క్షణం ఆలోచించి, "మేడం, మీరు నాకొక్క సహాయం చెయ్యండి. నేను సెలవు పెట్టినట్లు ఎవరికీ తెలియనీయకండి. ముఖ్యంగా మావారికి అసలు చెప్పద్దు - ఆయనగాని వచ్చి అడిగితే రిజైన్ ఇచ్చేసింది వద్దన్నా వినకుండా అని చెప్పండి."

ఆవిడ సుజాత వంక నవ్వుతూ చూసి, "ఐ అండర్‌స్టాండ్ యువర్ పాయింట్. డోంట్ వర్రీ... రవీంద్ర రానీ... నే చూస్తాలే" అని అభయం ఇచ్చింది.

* * *

మర్నాడు సావకాశంగా లేచి పిల్లలని తయారుచేస్తూ, టైమవుతున్నా తను తయారవని భార్యని చూసి, "ఏం ఇవాళ బ్యాంకుకి వెళ్ళవా, సెలవు పెట్టావా" అని ఆశ్చర్యంగా, అనుమానంగా అడిగాడు.

"నేను ఉద్యోగం మానేశాను. నిన్ననే రిజైన్ ఇచ్చేశాను." చాలా మామూలుగా అంది. రవీంద్ర ఒక్కక్షణం తెల్లబోయాడు. నోట మాట రాక అలా చూస్తుండి పోయాడు.

"రిజైన్ చేశావా... నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా..." అరక్షణంలో అతని మొహం ఎర్రబడి ఆవేశం పొంగుకువచ్చింది.

"చెప్పడానికి ఏముంది. మీరూ అన్నారుగా చెయ్యకపోతే మానేయి అని... ఇంట్లో ఇలా కొట్టుకుంటూ తిట్టుకుంటూ శాంతి లేకుండా నేను ఇంత కష్టపడి ఎందుకు చెయ్యడం ఆ ఉద్యోగం... నాకు ఒంట్లో అసలు బాగుండడం లేదు. అందుకే మానేశాను."

రవీంద్ర మనసులో అరక్షణంలో ఎన్నో 'లెక్కలు' భూతాల్లా ఎదుట నిలబడి భయపెట్టేశాయి. భార్య జీతం లేకపోతే... ఫ్లాట్ కొన్న లోను ఎలా తీర్చడం? ఇద్దరి సంపాదన ఉన్నా నెలాఖరుకి ఏం మిగలదు.... మరింక ఒక్క సంపాదనతో ఇల్లు ఎలా గడుస్తుంది? అతని కోపం తారస్థాయికి చేరింది సుజాత నిమ్మకు నీరెత్తినట్లుండడం చూసి.

"ఉన్నపాటున చెప్పా చెయ్యకుండా ఉద్యోగం మానేస్తే ఎలా అనుకున్నావు. నీ జీతం ఉందని ఫ్లాట్ కొన్నాను. అదెవరు తీరుస్తారు ఇప్పుడు. ఇల్లు కొనండి కొనండి అన్నావు. ఆ డబ్బు ఎలా తీర్చాలి." పళ్ళు కొరుకుతూ అడిగాడు.

"అమ్మేయండి ఫ్లాట్. అప్పు తీర్చేసి మిగతాదేమన్నా ఉంటే బ్యాంక్‌లో వెయ్యండి వడ్డీ వస్తుంది - అద్దె ఇంట్లోకి వెడదాం. బ్యాంక్ ఎలాగో హౌస్ రెంట్ ఇస్తుందిగా." చాలా కూల్‌గా అంది. భార్య మాట్లాడుతున్న తీరుకి కోపం ముంచుకు వస్తున్నా సుజాత నిజంగానే రిజైన్ ఇచ్చేసిందన్న నమ్మకం కలిగింది. దాంతో ఇంకా కోపం వచ్చింది - "నీ ఉద్యోగం ఉందనే నిబ్బరంతో ఫ్లాట్ కొన్నాను... అసలు ఏదో నీ ఉద్యోగం చూసే పెళ్ళాడాను... లేకపోతే నీ మాత్రంది దొరకదని కాదు - మా వాళ్ళు చూసిన సంబంధం చేసుకుంటే బోలెడు కట్నం వచ్చేది. నీ అందం చూసి చేసుకోలేదు. ఉద్యోగం కోసం చేసుకున్నాను." భార్య తనని ఇంత దెబ్బ కొట్టిందన్న కోపంతో సుజాతని అవమానపరచడానికి ఇంతకంటే మార్గం కనబడక కసిగా అన్నాడు.

సుజాత మొహం అరక్షణం నల్లబడింది. కానీ, అంతలోనే తేలిగ్గా నవ్వేసింది. "నాకూ తెలుసు ఆ మాట. నేనేం అందగత్తెను కానని - చాలా మామూలు మధ్యతరగతి అమ్మాయినని. అవును. వెధవ కట్నం మహా అయితే పాతిక వేలో, ఏభై వేలో ఇచ్చేవారు. ఉద్యోగం అయితే నా సర్వీసంతా కలిపి ఎన్ని లక్షలవుతుందో లెక్క కట్టి చేసుకుని ఉంటారు. ఏదో ప్రేమ కబుర్లు చెప్పి చేసుకున్నారని నాకు తెలుసు. సారీ, వెరీ సారీ. మీ లెక్కలు, అంచనాలు తలకిందులు అయిపోయాయి. చూడండి, ఈ రోజునించి నేనుత్తి హౌస్ వైఫ్‌ని... భర్త అంటే


భరించేవాడు. పెళ్ళి అర్థం అదే గదా. మీ వంతు పోషించడం, నా వంతు ఇల్లు నడవడం... నా బాధ్యత నేను నిర్వహిస్తాను. ఏవన్నాలోటు పాట్లుంటే అప్పుడనండి."

"చావండి, అందరూ మాడి చావండి. జీతం చాలదు. ఇది లేదు, అది లేదు అని అన్నావంటే చూడు, చెవుతా నీ వని చెవుతా. నా తడాఖా చూపిస్తా. నా కోసం నేను హాయిగా ఖర్చుపెట్టుకుంటాను. మీ కోసం క్లబ్బులు, ఫ్రెండ్సు, డ్రింక్స్ సిగరెట్లు అన్నీ మానాను. ఈ రోజునించి చూడు... చావకుండా రెండు పూటలా ఇంత తిండి పడేస్తాను. హాయిగా నేను ఎంజాయ్ చేస్తాను." క్రూరంగా అంటూ విసవిసా వెళ్ళిపోయాడు- సుజాతకి అతని కోపం అర్థం అయి నవ్వి ఊరుకుంది.

* * *

పది రోజులు గడిచాయి. పది రోజులుగా రవీంద్ర సుజాతతో మాట్లాడడం మానేశాడు. కావాలని ఇంటికి ఆలస్యంగా రావడం, వెంట ఓ రమ్ బాటిల్ తెచ్చుకోవడం, రాత్రి తొమ్మిదికి ఇంటికి వచ్చి సినిమాకి వెళ్ళానని పిల్లలతో చెప్పడం... ఇదంతా తన మీద కోపంతో చేస్తున్నాడని తెలుసు గనక ఏం అనకుండా ఊరుకుంది సుజాత. పది రోజులలోనే జీతం అంతా ఖర్చయి పోయింది - ఇంటి ఖర్చుకు ఇచ్చింది తప్ప చేతిలో పైసా మిగలలేదు. సుజాత ఏదో బెదిరించడానికి రెండు మూడు రోజులు ఇంట్లో ఉంటుంది అన్న ఆశ పదిరోజులు గడిచినా ఇంటి పట్టునే ఉండడంతో మనసులో బెదిరాడు. సెలవు పెట్టి ఉంటుంది. తనతో అలా అంది అని తనని తాను నమ్మించుకున్నాడు కొన్నాళ్ళు. ఆఖరికి పదిహేను రోజులు గడిచాక ఆగలేక బ్యాంక్‌కి వెళ్ళాడు. డైరెక్ట్‌గా వెళ్ళి అడిగితే మేనేజరు ఏమనుకుంటుందోనని తటపటా యించాడు. రవీంద్రని చూసిన మేనేజరు, ఇన్నాళ్ళుగా అతని రాక కోసమే ఎదురుచూస్తున్న సావిత్రి తనే అతన్ని పిలిచింది.

"రవీంద్ర గారూ... ఏమిటండీ సుజాత ఇలాంటి పని చేసింది. నిక్షేపం



లాంటి బ్యాంక్ ఉద్యోగానికి, అందులో పన్నెండేళ్ళ సర్వీసున్న ఉద్యోగానికి రిజైన్ ఇచ్చేసింది. నేనెంతో నచ్చజెప్పాను... షి డిడ్ యే ఫూలిష్ థింగ్. మీరన్నా చెవుతారనుకున్నాను" అంది. ఆ మాటతో రవీంద్ర మొహం రక్తం లేనట్టు ఇంకిపోయింది. "నిజంగానే రిజైన్ ఇచ్చేసిందన్న మాట." నిమిషం తరువాత మాట పెగుల్చుకుని అన్నాడు.

"నేనూ చెప్పాను మేడం... అసలు నాకు చెప్పకుండా చేసింది..."

"ఇంట్లో ఇబ్బందులు, చాకిరీ చెయ్యలేకపోతున్నాను. రెండూ సమర్థించుకోడం నా వల్ల గాదండి. తాను బాగా వీక్‌గా ఉంది - ఐ పిటీ హర్. కానీ, మళ్ళీ కావాలంటే ఉద్యోగం వస్తుందా... ఇదిగో చూడండి రిజిగ్నేషన్ లెటర్" అంటూ డ్రాయరు లోంచి తీసిచ్చింది. కాగితం చదివిన రవీంద్ర మొహం కాగితం లాగే అయింది.

"మీరు ఎక్సెప్ట్ చేశారా ఇది. పైకి ఫార్వర్డ్ చేశారేమిటీ..." బెదురుగా అడిగాడు. "లేదండి, ఏదో ఆవేశంలో చేసిందేమో, మళ్ళీ మనసు మార్చుకుని వస్తుందని కాగితం ఇంకా పైకి పంపలేదు - లీవ్ కిందే ట్రీట్ చేస్తున్నాను. మీకు చెవుదామని చూశాను. మీరే బ్రాంచిలో ఉన్నారో తెలియక..." ఆవిడ ఇంకా రిజిగ్నేషన్ లెటర్ పైకి పంపలేదన్న వార్తతో సగం ప్రాణం వచ్చింది రవీంద్రకి. "ప్లీజ్ మేడమ్, ఈ లెటరు పైకి పంపకండి. నేను సుజాతతో మాట్లాడతాను. "లాభం ఉంటుందనుకోను. తాను చాలా కచ్చితంగా చెప్పింది. మేం అందరం ఎంత చెప్పినా వినకుండా వెళ్ళిపోయింది..." అతని హావభావాలు గమనిస్తూ అంది సావిత్రి. "రవీంద్రగారూ... మీరేం అనుకోకపోతే ఒక మాట - చూడండి ఆడవాళ్ళం ఇంత కష్టపడి ఉద్యోగాలు ఎందుకు చేస్తున్నాం - కాస్త మీకు భారం తగ్గి, ఇంటికి కాస్త అవసరమైనవి అమర్చుకుని, పిల్లల్ని కాస్త మంచి చదువులు చదివించాలని గదా తాపత్రయం - ఆడది ఇటు ఇంట్లో, అటు ఆఫీసులో డబల్ పనితో ఆమె ఎంత అలసిపోతూందోనన్నది భర్తలు కాస్త గ్రహిస్తే మాలాంటి వారికి ఓదార్పుగా ఉంటుంది. ఇంట్లో భార్య ఇటు ఇల్లు, అటు ఆఫీసుతో అవస్థపడుతూంటే కాస్త సపోర్టు చెయ్యకపోతే ఎలా. ఆ భార్య మిషను కాదు గదా. ఫారిన్‌లో ఆడ, మగ ఉద్యోగాలు చేస్తారు. ఇంట్లో పనులూ ఆడ పని మగ పని అని లేకుండా ఇద్దరూ సర్దుకుంటారు. ఇదివరకటి రోజుల్లో సంపాదన మగాడి పని కాబట్టి ఇంటి పనులు భార్య చూసుకునేది. ఇప్పుడు భర్తతో పాటు ఆవిడా సంపాదిస్తున్నా మగాడి బరువు సగం పంచుకున్నా ఇంకా ఇంటి పని ఆవిడ డ్యూటీ అంటే ఎలా అండి. ఆడవాళ్ళు తెచ్చే సంపాదన కావాలి కాని, ఆవిడ బాధ్యత సగం తీసుకోం అంటే ఎలా కుదురుతుంది - పిల్లల్ని కనడం, పెంచడం ఎలాగూ తప్పదు - పెద్దగా వంటా వార్పులు చెయ్యకపోయినా సగం సగం పనులు పంచుకోకపోతే ఆ భార్య పరిస్థితి ఏమిటో ఆలోచించండి - సుజాతకి ఎంత విసిగెత్తి ఉంటే గాని ఇలా రిజైన్ ఇస్తుందా....."

రవీంద్ర మొహం గంటు పెట్టుకు వింటున్నాడు. "నా మటుకు నేను, మా ఆయన మా పనులు పంచుకున్నాం - వంట పని నాది - ఇల్లు సర్దడం, పక్కలు వేయడం, డస్టింగ్, నీళ్ళు పట్టడం, సాయంత్రం పిల్లల్ని చదివించడం అన్నీ ఆయన వంతు - ఎవరికన్నా ఒంట్లో బాగులేకపోతే ఆయనొకసారి, నేనొకసారి సెలవు పెడతాం - రెండేళ్ళకోసారి ఎల్.టి.సి మీద తప్పకుండా ఎటన్నా వెడతాం రొటీన్ నుంచి బయటపడడానికి - చుట్టాలు వచ్చినా ముందుగానే వాళ్ళకి చెప్పేస్తాం. ఇంట్లో వంట చేసి వెడతాం, మీ పనులు మీరు చూసుకోండి అని. ఇలా ఇద్దరం ఫ్రాంక్‌గా మాట్లాడుకుని డ్యూటీలు వేసుకున్నాక రిలాక్స్‌గా ఉన్నాం - ఏదో ఇలా సర్దుబాటు చేసుకోకపోతే, ఫిజికల్‌గా, మెంటల్‌గా భర్త సపోర్టు ఇవ్వకపోతే ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యడం చాలా కష్టం -" ఆవిడ రవీంద్ర ముఖకవళికలు గమనించినా చెప్పదలచింది చెప్పేసింది.

"ఈ లెటరు ఇంకో నాలుగైదురోజుల వరకు పంపకుండా ఉంచుతాను - ఈలోగా మీరు సుజాతని కన్విన్స్ చేయగలిగితే మంచిదే - మరి మీ ఇద్దరూ ఆలోచించుకోండి -"

"థాంక్స్ మేడమ్. ఐ విల్ టాక్ టు హర్ -" అన్నాడు.

* * *

మర్నాడు రవీంద్ర ఉదయం ఆరుగంటలకే లేచిపోయాడు. సుజాత వంటింట్లో పని చేస్తుండగా చకచక పక్కలు తీసేసి, పుస్తకాలు, పేపర్లు సర్దేసి, డస్ట్ చేసేశాడు. పిల్లల పుస్తకాలు సర్దేశాడు. పిల్లలు విడిచిన బట్టలు సబ్బు నీళ్ళల్లో నానబెట్టాడు. బాత్‌రూంలో వాష్ బేసిన్, కమోడ్ బ్రష్ పెట్టి కడిగాడు. వంటింట్లోంచి ఎందుకో బయటికి వచ్చిన సుజాత రవీంద్ర చేసిన, చేస్తున్న పనులు చూసి తెల్లబోయింది. "ఇటు సూర్యుడు అటు పొడిచాడా ఇవాళ. ఎంత శుభదినం..." హాస్యంగా అంది. రవీంద్ర మొహం సిగ్గుతో కాస్త ఎర్రబడింది.

"ఇంక రోజూ సూర్యుడు అటే పొడుస్తాడనుకో... ఇదిగో నేను ఇంట్లో చేసే పనులు అన్నీ లిస్టు రాసేశాను. ఇంకేమన్నా చేర్చాలంటే చేర్చు వంట తప్ప - అది నేను చేశానంటే ఇంట్లో ఆకలితో మాడాలి." చాలా తేలిగ్గా అనేశాడు. బాత్‌రూంలో దూరి తలుపు వేయబోతూ "ఇదిగో నిన్న మీ సావిత్రి మేడమ్ కనిపించి నిన్నెందుకో రమ్మన్నారు..." అంటూ తన మొహం చూపలేనట్టు తలుపు వేసుకున్నాడు.

సుజాతకి అర్థం అయింది ఇదంతా ఏమిటో... రవీంద్రలో మార్పుకి తృప్తిగా నిట్టూర్చింది. పదిహేను రోజులు ఇంట్లో కూర్చునే సరికి రెస్టు దొరికి... అలవాటయిన ఉద్యోగం లేక రోజంతా ఖాళీగా ఏం తోచనట్టయింది.

ఫెళ్ళున నాలుగు రోజులు ఎండ కాస్తే మబ్బు పట్టడం, ఉరుములు, మెరుపులు, వర్షం రావడం ప్రకృతిలో సహజమైనట్టే - సంసారలో ఎండలాంటి కోపాలు, ఆవేశాలు, తరువాత ఉరుముల్లా అరుచుకోడాలు, వర్షంలా కన్నీళ్ళూ సంసారాల్లో సహజమే - ఒక్క సంపాదనతో రోజులు వెళ్ళదీసే రోజులు పోయాయి. ఎంత 'ఇగో' ఉన్నా దిగమింగుకు దిగిరాక తప్పదు మగాళ్ళు - ఆడదానికి సంసారంలో - పరిస్థితులలో ఎడ్జస్ట్ అవక తప్పదు. లైఫ్ అంటేనే, అందులో మారేజ్ లైఫ్ అంటేనే ఎడ్జస్ట్‌మెంట్! - బతకడానికి ఎడ్జస్ట్‌మెంటు తప్పనిసరి! ■